సాక్షి
పల్నాడు
బుధవారం । 4 । జూన్ । 2025



ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో తనిఖీలు

దాచేపల్లి: దాచేపల్లి పరిధిలోని ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. అనధికార విత్తన నిల్వలపై ఆరా తీశారు.



వైభవంగా దేవస్థానం వార్షికోత్సవం

రెంటచింతల: పాలువాయి గ్రామంలో వేంచేసి యున్న శ్రీ లక్ష్మీ వినాయకస్వామి దేవస్థానం 31వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఒత్తిడి నివారణకు యోగా దోహదం

నరసరావుపేట: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం యోగాసనాలు నిర్వహించారు. జిల్లా ఎక్సైజ్ అధికారి మణికంఠ, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్వేషం.. విధ్వంసం

అంతన్నారు.. ఇంతన్నారు.. అందరినీ నమ్మించారు.. గంపగుత్తగా ఓట్లేయించుకున్నారు.. చివరకు ముంచేశారు. వైఫల్యాలను పక్కదారి పట్టించేందుకు 'ఎర్ర' పుస్తకం ఎంచుకున్నారు.. గ్రామాల్లో రక్తపుటేరులు పారించారు.. ప్రశ్నించిన వారిని అక్రమ అరెస్టులు చేయించారు.. అడ్డొచ్చిన వారిని అడ్డగోలుగా మూయించారు.. కేసులంటూ వేధించారు.. ఊళ్లకు ఊళ్లనే ఖాళీ చేయించారు. టూకీగా జిల్లాలో కూటమి ఏడాది పాలన ఇది. అధికారంలోకి వచ్చేందుకు అడ్డగోలు హామీలు.. నేడు వాటి అమలుపై మాత్రం బీద పలుకులు.. జిల్లాకు వచ్చిన కూటమి ముఖ్యనేతలు హామీల వరద పారించారు.. అరచేతిలో స్వర్గం చూపించారు. ఏడాది గడిచినా ఒక్కటంటే ఒక్క పథకమూ అమలు చేయలేదు.. ఒక్క హామీ పట్టాలెక్కలేదు. ఈ సారైనా హామీలు అమలు చేస్తారని నమ్మి ఓట్లేసిన ప్రజలకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారు.

- హామీలతో నమ్మించి ప్రజలను దగా
- ఊరూరా సూపర్‌సిక్స్ పేరుతో కరపత్రాలు
- ఒక్క పథకమూ ఇవ్వకుండా సామాన్యులను మోసం
- ఏడాదిగా అక్రమాలు, ఆక్రమణలు, మోసాలతో రెచ్చిపోతున్న అధికార పార్టీ నేతలు
- వైఎస్సార్ సీపీ సానుభూతి పరులపై హత్యలు, దాడులు
- పొలిటికల్ బాస్‌లకు సెల్యూట్ కొడుతున్న పోలీసులు
- నేటితో ఎన్నికల ఫలితాలు వెలువడి ఏడాది పూర్తి
- ప్రజలను మోసం చేస్తున్న కూటమికి వ్యతిరేకంగా నేడు వెన్నుపోటు దినం

కూటమి మోసాల పాలనకు ఏడాది



సాక్షి, నరసరావుపేట: ఎన్నికల ముంగిట అధికారంలోకి వస్తే సూపర్-6 పథకాలను అమలు చేస్తామని చంద్రబాబు నాయకత్వంలోని కూటమి పార్టీలు ఊరూవాడా తిరిగి ప్రచారం చేశాయి. ప్రతి సభలోనూ సూపర్ సిక్స్ పేరిట ఏయే పథకం ద్వారా ఎవరికి లబ్ధి కలుగుతుందో వివరించారు. జిల్లాలోని ప్రతి కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు పచ్చమీడియాలో ప్రత్యేక ఇంటర్వ్యూల పేరిట సూపర్-6లను వివరించారు. చంద్రబాబు పెదకూరపాడు, సత్తెనపల్లి, పిడుగురాళ్లలో పర్యటించి సంపద సృష్టించి అన్ని పథకాలను అమలుచేస్తామని భరోసానిచ్చాడు. ప్రజలు మరోసారి చంద్రబాబు అండ్ కో కపట మాటలను నమ్మి అధికారం అప్పగించారు. తీరా పీఠం ఎక్కి ఏడాదైనా చంద్రబాబు సూపర్-6 పథకాల అమలకు నోచుకోలేదు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజల ఆకలికేకలు పెడుతున్నారు. ప్రజల వద్ద ధన మార్పిడి పెద్ద మొత్తంలో జరగకపోవడంతో వ్యాపారాలు దెబ్బతిన్నాయని వ్యాపార వర్గాలు లబోదిబోమంటున్నాయంటే సంక్షేమ పథకాలు అమలుచేయకపోవడంతో ఎఫెక్ట్ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఉద్యోగము లేదు.. భృతీ రాదు

ఇంటింటికి ఉద్యోగం లేదా ఉద్యోగం వచ్చే వరకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అంటూ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 50 రోజులు దాటినా నిరుద్యోగుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. ఉద్యోగాలు భర్తీ చేయలేదు, ఆలోగా ఇవ్వాల్సిన నిరుద్యోగ భృతి రూ.3 వేలను విడుదల చేయలేదు. ఈ పథకం ప్రకారం ఇంటికో నిరుద్యోగి అనుకున్న జిల్లాలో 6.51 లక్షల కుటుంబాలకు నెలకు రూ.195.48 కోట్లు ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావొస్తున్న నేపథ్యంలో జిల్లా ప్రజలకు ప్రభుత్వం సుమారు రూ.2,345.76 కోట్లు బకాయిపడినట్లయింది. మరోవైపు కూటమి ప్రభుత్వ ఆధికారంలోకి రాగానే ఉద్యోగాలు పొందవచ్చని భావించిన యువత పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి. చంద్రబాబు మరోసారి యువతను మభ్య పెడుతున్నాడంటూ గగ్గోలు పెడుతున్నారు.

నెలకు రూ.1500 హుళక్కే!

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్-6లో మరో కీలక హామీ 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్య గల ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18,000 ఆర్థిక సహాయం అందజేస్తామని చెప్పడం. ఈ పథకం కోసం జిల్లాలోని మహిళలందరూ ఎదరుచూస్తుండగా ప్రభుత్వం మాత్రం ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది. దీని వల్ల జిల్లాలోని 7,80,538 మంది మహిళలకు నెల నెలా ప్రభుత్వం రూ. 117.08 కోట్లు బకాయిపడినట్టు అవుతోంది. ఏడాదికి ఒక్కో మహిళకు రూ.18 వేల చొప్పున ఈ పథకం ద్వారా సుమారు రూ.1,405 కోట్లు అందజేయాల్సి ఉంది.

బస్సు.. తుస్సు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని మహిళందరికి ఉచిత బస్సుప్రయాణం కల్పిస్తామని హామినిచ్చారు. దీని ప్రకారం పల్నాడు జిల్లాలో 5 ఏళ్ల మొదలు మొత్తం 10,92,752 మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణం అందజేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. దీని వల్ల ఉపాధి, ఉద్యోగాలు, వైద్యం, వివిధ పనులపై నిత్యం బస్సుల ప్రయాణించే మహిళలు ఆర్థికంగా నష్టపోతున్నారు. జిల్లాలో ప్రస్తుతం ఆర్టీసీ పరిధిలో 461 బస్సులు నిత్యం 2,995 ట్రిప్పులు చొప్పున రోజుకు 1,73,573 కిలోమీటర్లు తిరిగుతున్నాయి. ఇలా ఆర్టీసీ బస్సులలో రోజుకు సగటున 1,41,717 మంది ప్రయాణిస్తుండగా రూ.59.22 లక్షల ఆదాయం ఆర్టీసికి సమకూరుతోంది. ప్రస్తుత ఆదాయం ప్రకారం రూ.30 లక్షల మహిళల నుంచి రోజు ఆదాయం వస్తోంది అనుకున్నప్పటికి , ఉచిత ప్రయాణం అంటే మరో రూ.10 లక్షల అధికంగా తిరిగినా రోజుకు రూ.40 లక్షలు మహిళలు ఉచిత ప్రయాణం పేరిట ఆదాయం కానుంది. అంటే ఈ పథకం సరిగా అమలు చేస్తే పల్నాడు జిల్లాలోని మహిళలకు ఏడాదికి రూ.146 కోట్లు లబ్ధి కానుంది.

జిల్లాను ఎరుపెక్కించారు

కూటమి పార్టీలకు అనుకూలంగా ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే జిల్లాలో వైఎస్సార్ సీపీ నేతలు సానుభూతిపరుల ఇళ్లపై కూటమి గుండాలు దాడులు మొదలుపెట్టారు. వందలాది కుటుంబాలు పల్నాడు జిల్లా వదలి వేరే ప్రాంతాలకు వలస వెళ్లి తలదాచుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పోలీసులను అంబేడ్కర్ రాజ్యాంగం అమలుకు కాకుండా రెడ్ బుక్ రాజ్యాంగం అమలుకు వినియోగిస్తున్నారు. వైఎస్సార్ సీపీ నేతలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, విడదల రజిని, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మొదలు సుమారు 390 మంది కార్యకర్తలు, పాతిక మంది సోషల్ మీడియా యాక్టివిస్టులు, తొమ్మిది మంది జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు దిగారు. వందలాది మందిని జైళ్లపాలు చేసి కక్షా రాజకీయాలు చేస్తున్నారు. పోలీసులు పొలిటికల్ బాస్‌లకు సెల్యూట్ కొడుతున్నారన్న అపవాదుంది. మరోవైపు కూటమి నేతలు ఏడాదిగా ఇసుక, మట్టి, గ్రానైట్, రేషన్ బియ్యం అక్రమ రవాణాతో రూ.కోట్ల సంపాదించారు. ప్రభుత్వ, ప్రైవేట్ భూములను అక్రమించి వారి వశం చేసుకుంటున్నారు.

ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాటం

అధికారంలో ఉండగా గత ఐదేళ్లు పేదలకు సంక్షేమ ఫలాలు అందించిన వైఎస్సార్ సీపీ ప్రతిపక్ష పార్టీగా ప్రజల పక్షాన వారి సమస్యలపై పోరాటాలు చేస్తోంది. కూటమి ప్రభుత్వ దౌర్జన్యాలను ఎదుర్కొంటూనే ఇచ్చిన హామీల అమలుకు పోరుబాట ప్రారంభించింది. రైతుకు అండగా, విద్యుత్ పోరు, యువత పోరు లాంటి కార్యక్రమాలతో జిల్లా కేంద్రంతో పాటు, ప్రతి నియోజకవర్గ కేంద్రాలలో వైఎస్సార్ సీపీ నేతలు నిరసన ప్రదర్శనలు చేసి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఎన్నికల ఫలితాలు వచ్చి నేటికి ఏడాదైనా హామీలు అమలు చేయకుండా ప్రజలను వంచించిన నేపథ్యంలో వెన్నుపోటు దినం పేరిట వైఎస్సార్ సీపీ అన్ని నియోజకవర్గ కేంద్రాలలో నిరసన ర్యాలీలకు పిలుపునిచ్చారు.

తల్లికి మంగళం!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్కూల్‌కి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15,000 అందజేస్తామని హామీనిచ్చారు. ఈ పథకం ప్రకారం పల్నాడు జిల్లాలో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులందరికి ఒక్కొక్కరికి రూ.15వేలు అందజేయాల్సి ఉంది. పల్నాడు జిల్లాలో 2024-25 విద్యాసంవత్సరం 3,23,711 మంది విద్యార్థులకు ఏడాదికి రూ. 485.56 కోట్లు అందజేయాల్సి ఉంది. రెండో విద్యాసంవత్సరం కూడా ప్రారంభమైంది. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా బడులు తెరిచిన వెంటనే తల్లుల ఖాతాల్లో అమ్మ ఒడి నిధులు జమ అయ్యేవి. ఇలా పల్నాడు జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో రూ.977.45 కోట్లు తల్లుల వ్యక్తిగత ఖాతాలలో జమ చేసింది.



అన్నదాతకు వెన్నుపోటు

టీడీపీ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రతి రైతుకు ఏటా పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందజేస్తామని ప్రకటించింది. ఈ పథకం ప్రకారం పల్నాడు జిల్లాలో ఉన్న 2,80,181 మంది రైతులకు ఏటా రూ.560.36 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్రమం తప్పకుండా ఏటా వైఎస్సార్ రైతుభరోసా నిధులు అందజేశారు. పల్నాడు జిల్లాలో ఐదేళ్లలో ఏకంగా రూ.1,738.58 కోట్ల నిధులను నేరుగా రైతుల ఖాతాలలో జమ చేశారు.



అక్రమాలను ఎండగడదాం



నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు బుధవారం నిర్వహించే వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపు ఇచ్చారు. మంగళవారం ఆయన మీడియాకు వివరాలను వెల్లడించారు. ప్రభుత్వ అవినీతి, అరాచక విధానాలకు నిరసనగా గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి ఉదయం 10గంటలకు ఆర్డీఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అక్కడ ప్రభుత్వ అవినీతి, అరాచక విధానాలపై ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, వార్డు ఇన్‌చార్జీలు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, ప్రజలందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విజయవంతం చేయాలి



వినుకొండ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు జరిగే వెన్నుపోటు ర్యాలీని జయప్రదం చేయాలని వినుకొండ మాజీ ఎమ్మెల్యే, పార్టీ పీఏసీ సభ్యులు బొల్లాబ్రహ్మనాయుడు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయం నుంచి శివయ్యస్థూపం సెంటరు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని అధికారులకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఐదు మండలాల నుంచి పార్టీ నాయకులు, అభిమానులు, పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి..



సత్తెనపల్లి: రాష్ట్రంలో 2024 సాధారణ ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టి గెలిచిన తర్వాత పథకాలను అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వ మోసపూరిత విధానానికి వ్యతిరేకంగా తెలియజేసే నిరసన కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి మంగళవారం అన్నారు. ఏడాది పాలనా కాలంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా వంచిస్తున్న కూటమి ప్రభుత్వ అరాచకాలపై నేడు వెన్నుపోటు దినం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా ఈ ప్రభుత్వం సంపూర్ణంగా అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని దుయ్యబట్టారు.

మహిళలను వంచించిన ప్రభుత్వం



తల్లికి వందనం అంటూ టీడీపీ ప్రభుత్వం ప్రజలకు హామీలు ఇచ్చినా, వాటి అమలు మాత్రం నోచుకోలేదు. ఎన్నికలకు ముందు కూటమి నేతలు కుటుంబంలోని ప్రతి పిల్లవానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పడంతో ఆ మాటల్ని నమ్మి తమ పిల్లల్ని ప్రైవేటు స్కూళ్లలో చేర్పించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా నేటికీ ప్రజలకు ఇచ్చిన హామీని పట్టించుకోలేదు. మరోవైపు మహిళలకు నెల నెలా రూ.1,500 ఇస్తామన్నారు, ఉచిత బస్సు సదుపాయం అన్నారు. ఏదీ అమలు చేయకుండా మహిళలను వంచనకు గురిచేస్తున్నారు.

– చెరుకూరి నిర్మల,
సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు

న్యూస్‌రీల్

క్యూఆర్ కోడ్‌తో జనాభా నిర్వహణపై ప్రజాభిప్రాయం



నరసరావుపేట: జనాభా నిర్వహణ విధానంపై ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు ఈనెల ఒకటి నుంచి 20వ తేదీ వరకు క్యూఆర్ కోడ్ విధానం ద్వారా ప్రజాభిప్రాయం సేకరించేందుకు ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అర్థగణాంకశాఖ అధికారి మాలతి పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం క్యూఆర్ కోడ్ పోస్టర్ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు వారి పరిధిలోని కుటుంబాల నుంచి జనాభా నిర్వాహణ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా సేకరించాలని ఆదేశించారు. దీనిలో జేసీ సూరజ్ గనోరే, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు నాగార్జున సాగర్‌లో సామూహిక యోగా

నరసరావుపేట: జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రదేశం నాగార్జునసాగర్ వద్ద బుధవారం ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకూ సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు మంగళవారం పేర్కొన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించి యోగా ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకువెళ్తున్నామన్నారు. మే 28న ఇప్పటికే కోటప్పకొండపై సామూహిక యోగా నిర్వహించామన్నారు. జూన్ 11న కొండవీడు కోట, జూన్ 18న అమరావతి ధ్యానబుద్ధ విగ్రహం వద్ద సామూహిక యోగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

చిట్‌ఫండ్ యజమానికి బెయిల్ మంజూరు

గుంటూరు లీగల్: గుంటూరు జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టు మంగళవారం చిట్ ఫండ్ యజమానికి బెయిల్ మంజూరు చేసింది. పాలడుగు పుల్లారావు సాయిసాధన చిట్‌ఫండ్ కంపెనీ నడుపుతూ రూ.కోట్లు స్కామ్ చేసి ప్రజలను మోసం చేశాడనే అభియోగంపై అరెస్టయ్యాడు. దీనిపై నరసరావుపేట-1 టౌన్ సిటీ సీఐడీ వారు కేసు నమోదు చేశారు. ఇరువురి హామీతో షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

ఆళ్ల నాగేశ్వరరావుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం

తెనాలి: తెనాలికి చెందిన కవి, ఆర్టీసీ కండక్టర్ ఆళ్ల నాగేశ్వరరావు పేరు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైంది. విజయవాడకు చెందిన 'తెలుగు కళారత్నాలు' సాంస్కృతిక సేవా సంస్థచే సోమవారం అర్ధరాత్రి వరకు ఏకధాటిగా 10 గంటలపాటు జరిగిన సకల కళా ప్రదర్శనలో నాగేశ్వరరావు సాహిత్య ప్రదర్శనకు ఈ గౌరవం లభించింది. సంబంధిత ధ్రువీకరణ పత్రం, మెడల్‌ను ఏపీ సచివాలయం ఓఎస్‌డీ డాక్టర్ ప్రభాకర్, విశ్రాంత ఆదాయ పన్ను అధికారి డాక్టర్ పతంగి చెన్నయ్య, ప్రముఖ రచయిత్రి డాక్టర్ సరికొండ రమాదేవి సమక్షంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు యూవీ రత్నం అందజేశారు.

తెనాలిలో జన తరంగం

- దారిపొడవునా ఉప్పొంగిన అభిమానం
- ప్రియతమ నేతను చూసేందుకు కిక్కిరిసిన అభిమానులు
- బాధిత యువకుల తల్లిదండ్రులను పరామర్శించిన వైఎస్ జగన్
- జనసంద్రాన్ని తలపించిన తెనాలి పర్యటన



ఉప్పొంగిన అభిమానం.. తెనాలిలో పర్యటించిన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జేజేలు పలుకుతున్న జన సందోహంలోని ఓ భాగం

తెనాలి: ఎటుచూసినా జనతరంగం... దారిపొడవునా ఉప్పొంగిన అభిమానం... ప్రియతమ నేతను కనులారా చూసేందుకు ఆత్రుత, ఆరాటం... వెల్లువలా కదిలివచ్చిన జనంతో కిక్కిరిసిన రోడ్లు... జననేత కనిపించగానే చిరునవ్వులు చిందిస్తూ, ఆ క్షణాలను సెల్‌ఫోన్లలో బంధిస్తూ... హృదయం నిండా సంతోషంతో అభిమానులు మురిసిపోయారు. 'సీఎం.. సీఎం..' అంటూ తమ మనసులోని కోరికను పదేపదే నినదించారు. నడిరోడ్డుపై బహిరంగంగా పోలీసుల దాష్టీకానికి గురైన ముగ్గురు దళిత, మైనారిటీ యువకుల తల్లిదండ్రులను పరామర్శించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం చేసిన పర్యటన ఆద్యంతం జనసంద్రాన్ని తలపించింది.

పేదలకు అండగా నిలిచేందుకు...

స్థానిక కానిస్టేబుల్‌పై ఏప్రిల్ 24వ తేదీ రాత్రి దాడి చేశారన్న ఫిర్యాదుపై పట్టణానికి చెందిన యువకుడు, ఆ సమయంలో అక్కడే ఉన్న ఇద్దరు మంగళగిరి యువకులను ఏప్రిల్ 27వ తేదీన పోలీసులు అరెస్టు చూపారు. వాస్తవానికి ఘటన జరిగిన మరుసటిరోజునే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ స్టేషనులో థర్డ్ డిగ్రీ ప్రయోగించటమే కాకుండా, అరెస్టు చూపటానికి ముందే 26, 27వ తేదీల్లో జయప్రకాష్‌నగర్‌లోని సత్యం సమాధి దగ్గర నడిరోడ్డుపై, అయితానగర్‌లోని కూడలి ప్రదేశం నన్నపనేని లింగారావు సెంటరులో టూటౌన్, త్రీటౌన్ సీఐలు ఆ యువకులను బహిరంగంగా లాఠీలతో హింసించారు. ఇందులో సత్యం సమాధి దగ్గర చేసిన భౌతిక దాడి కొద్దిరోజుల క్రితం సోషల్‌మీడియాలో వైరల్ కావటం తెలిసిందే. ఏదైనా కేసులో నిందితులను చట్ట ప్రకారం అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపాల్సిన పోలీసులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవటంపై దళిత, ప్రజాసంఘాలు ఆగ్రహించాయి. మానవ హక్కుల కమిషన్, ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. బాధితుల కుటుంబసభ్యులు టూటౌన్ పోలీస్‌స్టేషనులో పోలీస్ అధికారులపై ఫిర్యాదు కూడా చేశారు. ఈ నేపథ్యంలో బాధిత యువకుల తల్లిదండ్రులను పరామర్శించేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం తెనాలి వచ్చారు.

కిక్కిరిసిన అభిమానులు

తెనాలి పొలిమేరల్లోని వీఎస్సార్ కాలేజీ వద్దకు చేరుకునేసరికి అప్పటికే అక్కడకు చేరుకున్న వేలాదిమంది కేరింతలు కొట్టారు. ప్రియతమ నేతకు జేజేలు పలికారు. అక్కడి నుంచి కిలోమీటరు దూరంలోని కాన్వాయ్ లింగారావు సెంటరుకు చేరుకునేందుకు 40 నిమిషాలకుపైగా సమయం పట్టింది. అయితానగర్‌కు కేంద్రమైన లింగారావు సెంటరు జనంతో కిక్కిరిసింది. ఆ జనాభిమానాన్ని చూసిన స్థానికులు, 2004 ఎన్నికల సమయంలో ప్రచారం నిమిత్తం వచ్చిన నాటి మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి పర్యటనను గుర్తుచేసుకున్నారు. అక్కడి నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదురు రోడ్డులోంచి బాధిత యువకుడు దోమా రాకేష్ నివాసానికి కాన్వాయ్ చేరుకోవటానికి మరికొంత సమయం పట్టింది. అప్పటికే ఆ సెంటరు అభిమానులతో కిటకిటలాడుతోంది. మాజీ సీఎం కాన్వాయ్ అక్కడకు చేరుకోగానే అభిమానులు ఒక్కసారిగా చుట్టుముట్టారు. దీంతో కొద్దిసేపు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కారులోంచి దిగలేదు. వ్యక్తిగత భద్రతా సిబ్బంది అతికష్టంపై జనాన్ని నిలువరించగా, కారులోంచి వైఎస్ జగన్ దిగారు. ఆయనతోపాటువచ్చిన పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ప్రాంతీయ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రి పేర్ని నాని, జూపూడి ప్రభాకర్‌లకు అప్పటికే అక్కడకు చేరుకున్న మాజీ మంత్రులు డాక్టర్ మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్, విడదల రజిని, ఎమ్మెల్సీలు ఎల్.అప్పిరెడ్డి, తలశిల రఘురామ్, నూరి ఫాతిమాలు అభివాదం చేశారు.

6 నుంచి జిల్లాలో ప్రత్యేక డ్రైవ్



మాట్లాడుతున్న కలెక్టర్ పి.అరుణ్‌బాబు, చిత్రంలో జేసీ సూరజ్ గనోరే, అధికారులు

జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

నరసరావుపేట: ఈనెల ఆరవ తేదీ నుంచి 14 వరకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి డ్రైయిన్లను శుభ్రం చేయాలని, అలానే నాల్గవ తేదీ నుంచి ఐదు వరకు ట్యాంకులు శుభ్రపర్చటం, క్లోరినేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో మండల అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వర్షాకాలం రానున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమీక్ష చేశారు. ఆయన మాట్లాడుతూ వెక్టార్, హైజీన్ యాప్‌లో వివరాలు త్వరితగతిన అప్‌లోడ్ చేయాలన్నారు. గార్బేజ్ సేకరణ ప్రతిరోజు చేపట్టాలన్నారు. మండల పరిషత్ అధికారులు తరచుగా సిబ్బందితో సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దేశ వ్యాప్తంగా కోవిడ్ మహమ్మారి విస్తరిస్తున్న నేపథ్యంలో అనుమానం ఉన్నవారు పరీక్షలు చేయించుకొని తగు జాగ్రతలు తీసుకోవాలన్నారు. యోగాంధ్రలో భాగంగా ఈ నెల 5వ తేదీన నాగార్జునసాగర్ వద్ద పదివేలమందితో కార్యక్రమం నిర్వహించానున్నామని, నాల్గవ తేదీన అనుపు వద్ద సుమారు వెయ్యిమందితో యోగా నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. జేసీ సూరజ్ గనోరే మాట్లాడుతో సిటిజన్ రిజిస్ట్రేషన్ వేగవంతం చేసి నిర్ణీత లక్ష్యాన్ని చేరుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ బీవీ రవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రసూన, డీఎల్‌డీ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

23న రెడ్‌క్రాస్ సాధారణ సమావేశం

నరసరావుపేట: జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సాధారణ సమావేశం ఈనెల 23వ తేదీ సాయంత్రం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్, జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి రెడ్‌క్రాస్ ప్యాట్రన్, వైస్ ప్యాట్రన్, లైఫ్ మెంబర్స్, లైఫ్ అసోసియేట్ మెంబర్స్ తమ గుర్తింపు కార్డులతో తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

క్లుప్తంగా

బ్రెయిలీ ఉచిత పాఠ్యపుస్తకాల కోసం దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట: జిల్లాలో ఒకటినుంచి పదోతరగతి వరకు చదివే అంధ విద్యార్థులు ఉచిత బ్రెయిలీ పాఠ్య పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా, వయో వృద్ధుల సంక్షేమశాఖ జిల్లా అధికారి జి.సువార్త మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, ఎన్జీఓ సంస్థల్లో చదివే అంధ విద్యార్థులు ఆయా సంస్థల హెడ్‌మాస్టర్లు, ప్రిన్సిపాల్స్ ద్వారా www.apdascac. ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. నిబంధనలను అనుసరించి ఉచితంగా వారికి బ్రెయిలీ పుస్తకాలు అందజేస్తామన్నారు. ఈ సదుపాయాన్ని బాలబాలికలు ఉపయోగించుకోవాలని ఆమె కోరారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మహాసభను జయప్రదం చేయండి

సంఘం జిల్లా అధ్యక్షుడు చినరామిరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఈనెల 5వ తేదీన విజయవాడలో తలపెట్టిన 3వ రాష్ట్ర కౌన్సిల్ మహాసభను జయప్రదం చేయాలని సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు స్వర్ణ చినరామిరెడ్డి కోరారు. సంఘం యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లా పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు సమావేశానికి హాజరు కావాలని కోరారు. సమావేశానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఆహ్వానించామని, ఆయన సానుకూలంగా స్పందించటంతో పాటు సమావేశానికి హాజరయ్యే ఉద్యోగులకు ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని వివరించారు. యూనిట్ సమావేశంలో జిల్లా కార్యదర్శి చుక్క వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శి షేక్ బాజీ, కోశాధికారి పీటర్ డామియన్ పాల్గొన్నారు.

బాలికపై లైంగిక వేధింపులు.. కేసు నమోదు



లక్ష్మీపురం: నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్ తెలిపారు. వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఏటీ అగ్రహారం పరిధిలోని ఓ ప్రాంతానికి చెందిన మహిళ ఓ వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు కలిగాక మనస్పర్థలతో విడాకులు తీసుకున్నారు. అదే ప్రాంతానికి చెందిన షేక్ మస్తాన్ అనే వ్యక్తిని ఆమె రెండో వివాహం చేసుకున్నారు. మొబైల్ షాపులో పని చేసుకుంటూ ఆమె జీవనం సాగిస్తున్నారు. మస్తాన్‌కు రెండో వివాహం చేయాలని ఆయన కుటుంబసభ్యులు సిద్ధం అయ్యారు. దీంతో ఆమె నిలదీయడంతో ఒంటరిగా వదిలేశాడు. ఇటీవల ఆమె కుమార్తె (8) నిద్రలో ఉలిక్కి పడటం, ఏడవడం వంటివి చేస్తుండటంతో ఏమైందని తల్లి ఆరా తీసింది. మస్తాన్ అసభ్యకరంగా ప్రవర్తించాడని చెప్పింది. దీంతో నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లైంగికదాడి, హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

2022లో ఆశావర్కర్‌పై లైంగిదాడి చేసి హతమార్చిన దుండగులు



ఆశా వర్కర్‌పై లైంగికదాడి చేసి, హత్య చేసిన నిందితులు

విజయపురిసౌత్: ఆశా వర్కర్‌పై లైంగికదాడి చేసి, హత్య చేసిన కేసులో ముగ్గురు నిందితులకు మంగళవారం గుంటూరు కోర్టు జీవిత ఖైదు, జరిమానా విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మాచర్ల మండలం అనుపు చెంచుకాలనీకి చెందిన రమావత్ నీలావతి (46) కొప్పునూరు, నాగులవరం పంచాయతీ పరిధిలోని అనుపు చెంచుకాలనీ, బీకేవీ పాలెం చెంచుకాలనీలో ఆశావర్కర్‌గా పనిచేస్తుంది. నీలావతి భర్త లస్కర్‌కు రెండో భార్య. లస్కర్ మొదటి భార్య సాయితో గ్రామ శివారులోని పొలంలో నివాసం ఉంటుంటాడు. 2022 సెప్టెంబర్ నెల 16వ తేదీ సాయంత్రం 6గంటలకు లస్కర్ నీలావతితో మాట్లాడి పొలానికి వెళ్లాడు. 17వ తేదీ ఉదయం ఇంటికి రాగా నీలావతి ఇంట్లో కనిపించలేదు. దీంతో పక్క ఇంటిలో ఉంటున్న నీలావతి తండ్రి లాలుకు విషయం తెలియజేశాడు. దీంతో ఇద్దరు గ్రామంలో విచారించగా మండ్లి ముత్తయ్య రాత్రి 9గంటల ప్రాంతంలో నీలావతి మా ఇంటివైపు వచ్చి సెల్‌ఫోన్ పోయిందని చెప్పిందని, అదే సమయంలో బీకేవీ పాలెంకు చెందిన సావిటి చిన్న అంజి, శీలం అంజి, శీలం భైస్వామి కూలి డబ్బుల కోసం తన దగ్గరకు వచ్చినట్లు తెలిపాడు. ఆ ముగ్గురు బీకేవీ పాలెంలో వెంకన్న అనే వ్యక్తి పోయిన సెల్‌ఫోన్ ఎక్కడ ఉంతో కనిపెడతాడని చెప్పటంతో వారితో నీలావతి ఆ గ్రామానికి వెళ్లిందని చెప్పాడు. దీంతో భర్త లస్కర్, గ్రామస్తులు వెంకన్నను విచారించగా తన దగ్గరకు వచ్చిన మాట వాస్తవమేనని సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్‌లో ఉందని తరువాత రోజు వస్తే చూస్తానని చెప్పటంతో నీలావతితో పాటు ఆ ముగ్గురు వ్యక్తులు నడుచుకుంటూ వెళ్లారని చెప్పాడు. గతంలో నేర చరిత్ర ఉన్న సావిటి చిన అంజి, శీలం అంజిలను గ్రామస్తులు గట్టిగా అడగటంతో ముగ్గురం లైంగిదాడి చేశామని, నీలావతి గొడవ చేయటంతో శీలం అంజి రాయితో తల మీద కొట్టటంతో మృతి చెందిందని చెప్పారు. రోడ్డు పక్కన సమీపంలో రెండు బండరాళ్ళ మధ్య నీలావతి మృతదేహాన్ని ఉంచి తాటాకులు కప్పినట్లు చెప్పి సంఘటన స్థలాన్ని చూపించారు. విషయాన్ని భర్త లస్కర్, గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించటంతో ముగ్గురు నిందితులైన చిన అంజి, శీలం అంజి, శీలం భైస్వామిలను అదుపులోకి తీసుకున్నారు. సావిటి చిన అంజి, శీలం అంజిలు గతంలో 2020 జనవరి నెలలో వెల్దుర్తి మండలం గుడిపాడు చెరువు గ్రామానికి చెందిన మహిళను అనుపువద్ద లైంగికదాడి చేసి హతమార్చిన కేసులో నిందితులు.

ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు

అప్పటి పల్నాడు జిల్లా ఎస్పీ శివశంకర్ రెడ్డి కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఈ కేసులో నిందితులపై అప్పటి నాగార్జునసాగర్ ఎస్ఐ పి.అనిల్‌కుమార్‌రెడ్డి, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ యు.రవిచంద్ర కేసు నమోదు చేశారు. ప్రస్తుత పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీ కంచి శ్రీనివాసరావు మానిటరింగ్ ద్వారా నరసరావుపేట మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఎం.వెంకటరమణ, కోర్టు హెడ్ కానిస్టేబుల్ టి.మాణిక్యాలరావు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లపు కృష్ణ నిందితులకు శిక్ష పడటంలో కీలక పాత్ర పోషించారు. ముగ్గురు నిందితులకు గుంటూరు 5వ అడిషనల్ కోర్టు జడ్జి కె.నీలిమ 376 డీ సెక్షన్ కింద 20 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.20వేల జరిమానా, అలాగే 376 ఏ సెక్షన్ కింద 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.20వేల జరిమానా, 302సెక్షన్‌కు గానూ జీవిత ఖైదు, 20వేల రూపాయల జరిమానా, 201 సెక్షన్ కింద 7 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మోసగించిన వారిపై చర్యలు తీసుకోండి

జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన మహిళ



నరసరావుపేట ఎస్పీ కార్యాలయం వద్ద బాధితురాలు మంజుభార్గవి, బంధువులు

నాదెండ్ల: ఓ వివాహిత తనకు జరిగిన మోసం, అన్యాయంపై పల్నాడు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది. నాదెండ్ల మండలం ఇర్లపాడు గ్రామానికి చెందిన మంజుభార్గవి బాపట్ల జిల్లా అద్దంకి పట్టణంలో తన నానమ్మ ఇంట్లో ఉంటూ చదువుకుంది. ఆ సమయంలో విశ్వభారతి జూనియర్ కాలేజ్ డైరెక్టర్, తమ దూరపు బంధువు అయిన సోడిశెట్టి రామానాయుడు తనను ప్రేమ పేరిట లోబరుచుకున్నాడని, గర్భిణిని చేశాడని పేర్కొంది. వివాహం చేసుకోమని అడిగితే ముఖం చాటేశాడని, అధికకట్నం తీసుకుని మరో మహిళను పెళ్లి చేసుకునేందుకు సిద్ధపడ్డాడని పేర్కొంది. ఈ విషయపై తాను 2022 ఫిబ్రవరి 8న నరసరావుపేటలోని దిశా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. దీంతో రామానాయుడు తల్లి వెంకటసుబ్బమ్మ, బంధువులైన దుర్గాప్రసాద్, విజయవాడలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మేకల నరేంద్ర తనతో మాట్లాడి రామానాయుడితో వివాహం జరిపిస్తామన్నారు.

■ అయితే కొన్ని రోజుల తర్వాత రామానాయుడు సోదరుడు కామేశ్వరరావును వివాహం చేసుకోవాలంటూ వారితో పాటూ ఇతర బంధువులు తనను బలవంతం చేయటంతో అంగీకరించానన్నారు. కామేశ్వరరావుతో తనకు వివాహమైన మూడు రోజుల తర్వాత పదహారు రోజుల పండుగకు వస్తానని చెప్పి కామేశ్వరరావు వెళ్ళిపోయాడని పేర్కొంది. అయితే రామానాయుడు తనకు అసభ్యకరరీతిలో వాట్సాప్‌లో మెసేజీలు పెట్టేవాడని వాపోయింది. విషయాన్ని కామేశ్వరరావుకు ఫోన్‌లో చెప్పినా పట్టించుకోలేదని, నీకు తగిన శాస్తి జరిగిందంటూ తిట్టాడని వాపోయింది. 2023 ఏప్రిల్ 27న తన తల్లిదండ్రులు, తమ్ముడితో కలిసి అత్తారింటికి వెళ్లగా, తన అత్త చెప్పాపెట్టకుండా ఇల్లు వదిలి వెళ్లిపోయిందన్నారు. అప్పటి నుంచి తన తల్లితో అద్దంకిలోనే ఉంటున్నానని పేర్కొంది.

■ అప్పట్లో తన ఫోన్ తీసుకుని ఏఆర్ కానిస్టేబుల్ నరేంద్ర, దుర్గాప్రసాద్‌లు తన ఫోన్‌ను హ్యాక్ చేసి 2023లో తనపై బంధువులకు చెడుగా ప్రచారం చేశారని వాపోయింది. వారు పలుమార్లు తనపై హత్యాయత్నం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. తనను మోసగించిన రామానాయుడు, తన భర్త కామేశ్వరరావు, ఏఆర్ కానిస్టేబుల్ నరేంద్ర, దుర్గాప్రసాద్‌లపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరింది. ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, హోంమంత్రి అనిత, మంత్రి నారా లోకేష్‌లకు ఫిర్యాదు అందించినట్లు తెలిపింది.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

డీఎస్ఓ నరసింహారెడ్డి



నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కడపలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి గాను 4, 5 తరగతులలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి మంగళవారం తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 19వతేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. క్రీడా శాఖ వెబ్‌సైట్ www. apsportsschool. ap. gov. in ద్వారా తరగతుల వారీగా సీట్లు వివరాలు, షెడ్యూలు, నోటిఫికేషన్ వివరాలు తెలుసుకోవచ్చని వివరించారు. క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో బాలురు 20, బాలికలు 20, 5వ తరగతిలో బాలురు 20, బాలికలు 20 సీట్లు ఉన్నాయని తెలిపారు. 4వ తరగతి ప్రవేశానికి అభ్యర్థులు 8 నుంచి 10 సంవత్సరాల వయస్సు మధ్య ఉండాలని, అలాగే 5వ తరగతి ప్రవేశానికి 9 నుంచి 11 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని తెలిపారు. జనన ధ్రువీకరణ పత్రం వాస్తవ పుట్టిన తేదీ నుంచి ఒక సంవత్సరం లోపు జారీ చేసి ఉండాలని స్పష్టం చేసారు. దరఖాస్తుదారుని ఒరిజినల్ సర్టిఫికెట్లు, వైద్య పరీక్షల్లో సంతృప్తి చెందిన తరువాత మాత్రమే జిల్లాస్థాయి ఎంపిక పోటీలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. జిల్లాస్థాయిలో సాధించిన మెరిట్ ప్రాతిపదికన రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారనీ, రాష్ట్రస్థాయిలో వచ్చిన మార్కుల ఆధారంగా మెరిట్ ప్రాతిపదికను సీటు కేటాయిస్తారని తెలిపారు. జిల్లాస్థాయి శారీరక సామర్థ్య పరీక్షలు ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు, రాష్ట్రస్థాయి పరీక్షలు జూలై 10, 11 తేదీలలో నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం మెరిట్ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారని స్పష్టం చేశారు. అర్హులైన అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బోధనావిధానంలో మార్పులకు శ్రీకారం

జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ



మాట్లాడుతున్న డీఈఓ

నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన అందించే దిశగా పలు మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 2025–26 విద్యాసంవత్సరం నుంచి తీసుకువస్తున్న మార్పులపై ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు అవగాహన కల్పించే విధానంలో భాగంగా జిల్లా రిసోర్స్ పర్సన్స్‌కు జిల్లా స్థాయి 3రోజుల శిక్షణ తరగతులు మంగళవారం మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో ప్రారంభించారు. ప్రారంభ సమావేశంలో పాల్గొన్న డీఈఓ చంద్రకళ మాట్లాడుతూ, ఈ విద్యాసంవత్సరం నుంచి చేపట్టిన మార్పులలో భాగంగా మూల్యాంకన పుస్తకాలు – నిర్వహణ, అకడమిక్ క్యాలెండర్, హ్యాండ్ బుక్, గ్రంథాలయాల నిర్వహణ, బ్రిడ్జి కోర్సులపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించనున్నట్టు వివరించారు. జిల్లావ్యాప్తంగా 130 మంది రిసోర్స్ పర్సన్స్‌కు ఆయా అంశాలలపై మూడు రోజుల పాటు జరగనున్న శిక్షణా తరగతులలో అవగాహన కల్పించనున్నారు. ఎస్‌సీఈఆర్‌టీ పరిశీలకులు లక్ష్మీప్రసన్న, డీసీఈబీ చైర్మన్ ఐ.కృష్ణానాయక్, డైట్ అధ్యాపకులు బి.బాలకోటయ్య, ఎం.సాంబశివరావు, రాష్ట్ర రిసోర్స్ పర్సన్స్, సబ్జెక్ట్ నిపుణులు పాల్గొన్నారు.

ఘరానా నేరగాడు అరెస్టు

- 16వ నంబరు హైవేపై దారిదోపిడీకి పాల్పడి పరారీ
- గంటల వ్యవధిలో పోలీసులకు అప్పగించిన స్థానికులు

ప్రత్తిపాడు: హైవేపై దారిదోపిడీకి పాల్పడిన యువకుల్లో ఒకరిని గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెంకు చెందిన గొర్రెల కాపరి శాఖమూరి శ్రీనివాసరావు మంగళవారం ఉదయం కొత్తమల్లాయపాలెంలో ఉన్న తన గొర్రెల మంద వద్దకు ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. అదే సమయంలో పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన దేవర భవానీ ప్రసాద్ (21), మరో ఇద్దరు యువకులు నంబరు ప్లేటు లేని స్కూటీపై వచ్చి నడింపాలెం డొంక రోడ్డు వద్ద శ్రీనివాసరావు బైక్‌ను అడ్డగించారు. శ్రీనివాసరావు మెడపై హుక్ ఉంచి చంపుతామని బెదిరించి జేబులో ఉన్న రూ. 3,600 నగదు లాక్కున్నారు. అంతటితో ఆగకుండా ముగ్గురు యువకులు ఆయన ముఖంపై విచక్షణారహితంగా పిడిగుద్దులు గుద్దుతూ దాడికి పాల్పడ్డారు. బైక్ తాళం, ఫోన్ లాక్కుని పక్కనే ఉన్న పొలాల్లోకి విసిరేసి అక్కడి నుంచి బోయపాలెం వైపు పరారయ్యారు. వెంటనే తేరుకున్న శ్రీనివాసరావు ఫోన్ ద్వారా గ్రామస్తులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన గ్రామస్తులు బోయపాలెం పరిసరాల్లో ముగ్గురు యువకుల కోసం గాలించారు. హైవే పరిసరాల్లో ఓ బడ్డీ బంకు వద్ద ఉండటాన్ని గమనించి పట్టుకునేందుకు ప్రయత్నించగా ఇద్దరు పరారయ్యారు. చేతికి చిక్కిన భవానీ ప్రసాద్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు శాఖమూరి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ కె. నాగేంద్ర కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టుకు హాజరు పరిచారు.

పలు స్టేషన్లలో కేసులు..

గ్రామస్తులు పోలీసులకు అప్పగించిన భవానీ ప్రసాద్ గురించి ఆరా తీసిన పోలీసులకు విస్తుపోయే విషయాలు తెలిశాయి. ఇతనిపై పల్నాడు జిల్లాలోని నరసరావుపేట వన్ టౌన్, టూటౌన్, రూరల్, నకరికల్, సత్తెనపల్లి, చిలకలూరిపేట, వినుకొండ, బాపట్ల జిల్లాలోని మార్టూరు, పెదనందిపాడు, పర్చూరు, గుంటూరు జిల్లాలోని పెదకాకాని తదితర స్టేషన్లలో 27 కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆయా కేసులన్నీ 2022 నుంచి నమోదైనవే కావడం గమనార్హం.

తాళం వేసిన ఇంట్లో చోరీ

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని ఇప్పటం గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. మంగళవారం ఇద్దరు మహిళలు అక్కడ అనుమానంగా తిరుగుతుండడంతో స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సేకరించిన వివరాల ప్రకారం .. ఇప్పటం గ్రామానికి చెందిన పోతగాని గోపి వేసవి సెలవులకు వేరే ఊరు వెళ్లారు. పక్కనే ఉండే గోపి తమ్ముడు పులి మనోజ్ ఇక్కడే ఉన్నారు. గోపి ఇంటి తాళాలు పగలకొట్టి ఉండడం, అక్కడే ఇద్దరు మహిళలు ఉండడంతో వారిని అనుమానించి పోలీసులకు అప్పగించారు. ఇంట్లోని బీరువాలో ఉన్న రూ.10 వేలతో పాటు వాచ్ పోయిందని గోపి ఫిర్యాదు ఇచ్చారు. సదరు మహిళలు మాత్రం తాము రైల్వే ట్రాక్ వెంబడి ప్లాస్టిక్ డబ్బాలు సేకరిస్తుంటామని, చోరీ చేసే ధైర్యం లేదని, తాగునీరు పట్టుకుని ఇంట్లో జామకాయలు కోస్తుండగా పట్టుకున్నారని చెబుతున్నారు. ఒకవేళ దొంగతం చేస్తే ఆ డబ్బు, వస్తువులు తమ వద్ద ఉండాలి కదా అని ప్రశ్నిస్తున్నారు. తాడేపల్లి పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

పీజీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను మంగళవారం విడుదల చేశామని సీఈ ఎ.శివప్రసాదరావు తెలిపారు. ఫలితాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌యూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని తెలిపారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి జూన్ ఆఖరుతేదీగా నిర్ణయించామన్నారు.

బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో నిర్వహించనున్న బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్ష ఫీజు షెడ్యూల్‌ను మంగళవారం సీఈ విడుదల చేశారు. పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈ నెల 19వ తేదీ వరకు గడువు ఉంది. రూ. 100 ఆలస్య రుసుంతో 20వ తేదీ వరకు చెల్లించవచ్చు. రెండో సెమిస్టర్ థియరీ పరీక్షలు జులై 8వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి. వివరాలు వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చు.

పాఠశాల ప్రాంగణంలో గుడి..!

- పంతాలకు వేదికగా మారిన కొత్త కొత్తపాలెం ఎస్సీ కాలనీలోని పాఠశాల
- నాడు – నేడు మరుగుదొడ్లను సైతం కూల్చివేసిన వైనం



పాఠశాల భవనం

నూజెండ్ల: భవిష్యత్ తరాలకు ఉపయోగపడాల్సిన పాఠశాల గ్రామస్తుల పంతాలకు వేదికైంది. దీంతో అక్కడ చదువుతున్న 35 మంది విద్యార్థుల చదువులు ప్రశ్నార్థకమయ్యాయి. పాఠశాల ఆవరణలో గుడి నిర్మించాలని ఓ వర్గం నడుం బిగించగా విద్యార్థులకు ఇబ్బందిగా ఉంటుంది వేరే చోట ఏర్పాటు చేయాలని మరో వర్గం వారు నిలవరించటానికి ప్రయత్నిస్తున్నారు. మండలంలోని కొత్త కొత్తపాలెం ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో చేపడుతున్న గుడి నిర్మాణం వివాదాస్పదంగా మారింది. ఇందు కోసం గత ప్రభుత్వ హయాంలో పాఠశాల ఆవరణలో చేపట్టిన నాడు నేడు మరుగుదొడ్లను సైతం కూల్చి వేశారు. రాత్రికి రాత్రి స్థలాన్ని చదును చేశారు. నిర్మాణ పనులు వేగవంతం చేశారు. భక్తులకు అందుబాటులో గుడి నిర్మాణం చేపట్టడం ఆనందమే కానీ ప్రశాంత వాతావరణంలో చదువుకోవాల్సిన విద్యార్థులకు ఇబ్బంది కాదా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అనుకూలమైన మరో ప్రాంతంలో గుడి ఏర్పాటు చేసుకోవచ్చు కదా అని విద్యావంతులు అభిప్రాయపడుతున్నారు. అయితే గుడి కట్టాల్సిందే ఎవరు అడ్డు వస్తారో చూస్తామంటూ.. ఎంత వారించినా వినకుండా ఇటువంటి అనైతిక దుశ్చర్యకు కొంత మంది పాల్పడుతున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి బడి స్థలంలో నిర్మాణాలు అడ్డుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. వివాదంపై ఎంఈఓ రవిచంద్రను వివరణ కోరగా కొంత మంది గ్రామస్తులు ఫిర్యాదు చేశారని సంఘటనా స్థలాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

'ప్రైమరీ' హెచ్‌ఎం పోస్టులను ఎస్జీటీలతో భర్తీ చేయాలి

ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు

చిలకలూరిపేట: ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎం పోస్టులను సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ) పదోన్నతుల ద్వారానే భర్తీ చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో సంఘ సభ్యుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల పోస్టులన్నీ ఎస్జీటీలతోనే భర్తీ చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ, సదరు పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా కేటాయిస్తున్నారనే సమాచారం రావడం బాధాకరమన్నారు. అలాగే మోడల్ ప్రాథమిక పాఠశాలలకు కేటాయించిన హెచ్‌ఎం పోస్టులను 100 శాతం సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల పదోన్నతుల ద్వారానే భర్తీ చేయాలని కోరారు. అలాకాకుండా స్కూల్ అసిస్టెంట్ల స్థాయిని తగ్గిస్తూ వారిని తాత్కాలిక ప్రాతిపదికన ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా నియమించటం సరికాదన్నారు. ఈ చర్యను ఉపాధ్యాయ లోకం తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలన్నారు. ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు ఉద్యమ బాట పట్టేలోగా దీనిని సరిదిద్దుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. స్కూల్ అసిస్టెంట్ల సేవలను ఉన్నత పాఠశాలల్లో మాత్రమే ఉపయోగించుకోవాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు వినుకొండ అక్కయ్య, మేకల కోటేశ్వరరావు, వి.జయప్రకాశ్, షేక్ మగ్బూల్ బాష, బొంతా రవి, షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

రూ.51 కోట్లతో అభివృద్ధి పనులు

ఆమోదం తెలిపిన స్టాండింగ్ కమిటీ



స్టాండింగ్ కమిటీ సమావేశంలో చర్చిస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు, సభ్యులు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో సుమారు రూ.51 కోట్లతో పలు డివిజన్లలో అభివృద్ధి పనులను నిర్వహించడానికి స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపిందని స్టాండింగ్ కమిటీ చైర్మన్, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. మంగళవారం స్టాండింగ్ కమిటీ సమావేశం మేయర్ చాంబర్‌లో జరిగింది. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో నగరంలోని ఆయా డివిజన్లకు సంబంధించిన ప్రజా ప్రతినిధులు, నగర పాలక సంస్థ అధికారులు ప్రతిపాదించిన 143 అంశాలకు సంబంధించిన అభివృద్ధి పనులపై సభ్యులు, వివిధ విభాగాధిపతులతో చర్చించి, ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర శివారు, నగర పాలక సంస్థలో విలీనమైన గ్రామాలలో రోడ్లు, డ్రైయిన్లు, వీధి దీపాలు, తాగు నీటి పైపులైన్లు ఏర్పాటు వంటి పనులకు ఆమోదం తెలిపామన్నారు. నాజ్ సెంటర్, స్వామి థియేటర్ వద్ద, అడవితక్కెళ్ళపాడులలోని షాపింగ్ కాంప్లెక్స్‌లలో లీజు గడువు పూర్తయిన షాపులకు నిబంధనల ప్రకారం రెన్యూవల్ చేయడానికి ఆమోదించామన్నారు. గుంటూరు నగరంలో వీధి కుక్కల బెడద అధికంగా ఉండటంతో వాటికి శస్త్రచికిత్సలు, యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ వేసేందుకు అదనంగా ముగ్గురు పశువుల డాక్టర్లు, ఆపరేషన్ థియేటర్ సహాయకులను నియమించాలని నిర్ణయించామని తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, కొమ్మినేని కోటేశ్వర రావు, నూకవరపు బాలాజీ, దాసరి లక్ష్మీదుర్గ, ముప్పవరపు భారతి, నగర పాలక సంస్థ ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం పాల్గొన్నారు.

వృద్ధురాలు అనుమానాస్పద మృతి

లైంగికదాడి చేసి అనంతరం హతమార్చి ఉంటారని స్థానికుల అనుమానం



మంచంపై మల్లీశ్వరి మృత దేహం (ఇన్‌సెట్లో) తాడిపత్రి మల్లీశ్వరి (ఫైల్)

తెనాలి రూరల్: తెనాలిలో ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. లైంగికదాడి తర్వాత హత్య చేసి, ఆభరణాలు చోరీ చేసి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు, స్థానికుల కథనం మేరకు... పట్టణ ముత్తెంశెట్టిపాలెం తూర్పు కాల్వ కట్ట రోడ్డులో కబేళా వంతెన నుంచి వైకుంఠపురం వెళ్లే మార్గంలో అయ్యప్పస్వామి గుడి పక్కనే తాడిపత్రి మల్లీశ్వరి (60) ఒంటరిగా నివసిస్తోంది. టిఫిన్ బండి, టీ స్టాల్, కూల్‌డ్రింక్ దుకాణం నిర్వహిస్తోంది. ప్రతి రోజు తెల్లవారుజామున 4.30 గంటలకు లేచి టిఫిన్ బండి పనులను ప్రారంభిస్తుంటుంది. అదే సమయంలో టీ కూడా విక్రయించడంతో ఉదయాన్నే అక్కడి వారు టీ తాగేందుకు వస్తుంటారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం వచ్చిన వారు మల్లీశ్వరి బయటకు రాలేదని, ఇంటి కిటికీ నుంచి చూశారు. ఇంకా మంచంపైనే ఉంది. పిలిచినా స్పందన లేకపోవడంతో ఇదే ప్రాంతంలో నివసించే ఆమె కుమార్తెకు సమాచారం ఇచ్చారు. ఆమె వచ్చి చూడగా మల్లీశ్వరి మృతి చెంది ఉన్నట్టు గుర్తించింది.

మృతురాలి ఒంటిపై బంగారు ఆభరణాలు, బీరువాలోని నగలు చోరీకి గురైనట్టు తెలిసింది. స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. వన్ టౌన్ సీఐ వి. మల్లికార్జునరావు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని తెనాలి వైద్యశాలకు తరలించారు.

మృతిపై అనేక అనుమానాలు..

మల్లీశ్వరి మృతిపై స్థానికుల నుంచి అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంటి తలుపునకు బయట గడి పెట్టి ఉండడం, విగతజీవిగా పడి ఉన్నప్పుడు శరీరంపై దుస్తులు సరిగా లేకపోవడం, ఆభరణాలు మాయమవడంతో ఆమెపై లైంగిక దాడికి పాల్పడి, హత్య చేసి ఉంటారని భావిస్తున్నారు. అనంతరం ఆభరణాలు, నగదు దోచుకెళ్లి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. తెలిసిన వారే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. మల్లీశ్వరిది అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశామని, దర్యాప్తులో మరిన్ని విషయాలు వెలుగు చూసే అవకాశం ఉందని సీఐ తెలిపారు.